# యక్షగానం

యక్షగానం తెలుగువారి అతిప్రాచీన కళ. శ్రీ పాల్కురి సోమనాధ కవి తన పండితారాధ్య చరిత్రలో (1280-1340) యక్షగాన కళారూపాన్ని "పార్వతీ ప్రకరణం"లో శివరాత్రి మహోత్సవ రోజున శ్రీశైలక్షేత్రంలో ప్రదర్శించబడినట్లుగా వ్రాయబడింది. "యక్షగానం" అనే పదాన్ని ముందుగా తమ గ్రంధమైన "భీమేశ్వర పురాణం"లో శ్రీనాధ మహాకవి ప్రస్తావించుట జరిగింది.

తెలుగునాట జక్కులవారను నృత్యం చేయు కులం చాలా ప్రాచీనం నుండి ఉంది. ఈ జక్కులవారి ప్రస్తావన తిరుపతిలో 15వ శతాబ్ధానికి సంబంధించిన శాసనాలలలోనూ శ్రీ పురుషోత్తమ దీక్షితుల వారి తంజాపుర అన్నదాన మహానాటకం



(17వ శతాబ్దం) లోనూ ప్రస్తావించబడింది. ఈ ఆధారాల మూలంగా తెలుగునాట అతి ప్రాచీనం నుండి జక్కులకులంలవారు సంగీతంతో నృత్యం చేసి ప్రదర్శనలిచ్చేవారని తెలిస్తోంది. వారిపాటకు "జక్కుపాట" అనివాడుక తెలుగుభాషలోను "యక్షగానమని" సంస్కృతంలోను చెప్పబడుతోంది. శ్రీ విజయరాఘవనాయకరాజు యక్షగానాన్ని నాటకమని కొనియాడి తానుకూడా 23 యక్షగానంలు రచించినాడు. ముందుగా ఒక్క కళాకారుడే అందరిపాత్రలను నటించుచూ కథను వివరించుట నుండి 19వ శతాబ్దినాటికి అన్ని పాత్రలను కళాకారులు ధరించి ప్రదర్శించుట ప్రారంభమైంది. యక్షగానంలో పాటకు నృత్యాన్ని అభినయానికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వబడుతోంది. ఇప్పటికినీ ఈ పద్ధతినే అవలంభించుచున్నారు.

500 సంవత్సరంలపైన చరిత్రగలిగిన యక్షగానం వివిధ మార్గంలలో ప్రయాణిస్తూ ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా మలచుకోవటం జరిగింది. యక్షగానం ప్రభావం వలన జంగం కథ, హరికథ ఆవిర్భవించి ప్రజలను అలరించుచున్నవి.

కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాలలో యక్షగాన కళాకారులు ఉన్నారు.